

# గేటుకాపరి కథ

రామనాథంగారు రాజుని ఓదార్చేసరికి గేటు మూడుసార్లు మూసి నాలుగుసార్లు తెరిచారు.

రాజు కథ విన్నాక రామనాథంగారికి జాలి వేసింది.

''అయితే గేటు అంటే అంతభయం అన్నమాట. గేటు దాటడం కోసం గూర్ఖాకి రూపాయిద్దామనుకున్నావా? ఏం లాభం బాబూ'' అన్నాడాయన.

ఏ లాభం లేదని ఆయనే జవాబూ చెప్పాడు.

"ఆ స్టుడియో గేటు దాటడం మాటల్తో పనికాదు రాజూ. వీడికి రూపాయిచ్చి దాటడం ఓ దాటడమా, దానివల్ల ఏం లాభంలేదు. నిజంగా ఆగేటు దాటడానికి ముందర ఎన్నో గేట్లు ఎన్నోసార్లు దాటాలి. సినిమా పరిశ్రమలో పెద్దసైజు మావయ్యలూ, బావమరుదులూ, బాబాయిలూ, బంగారు బొమ్మలాంటి అమ్మాయిలూ, లేకపోతే ఇదేరూటు అనుకో. కాని దీని కెంతో ఓర్పు కావాలి. చాలా నేర్పు కావాలి. మజాకా కాదు.

ఓ కథ చెబుతాను విను....వాహినీ గేటుకేగా నువ్వెళ్ళేది. నేనూ అటేలే. కబుర్లు చెప్పుకుంటూ పోదాం కాస్త చురుగ్గా అడుగెయ్యి.

పూర్వకాలంలో నేనూ దిలీప్‌కుమారూ కలిసి ఓ గదిలో ఉండనపుడు — ఎప్పుడూ లేమనుకో — నేను బొంబాయిలో లాట్రీ కొట్టేవాణ్ణి. లాట్రీ అన్నమాటకి టీకా తాత్పర్యాలు నీజేబులో డబ్బులయిపోయాక తెలుస్తాయిలే. తొందర్లేదు. ఏం? అపుడు లాలా అని ఓ ఫ్రెండు ఉండేవాడు. వాడు నాకు గురువనుకో, అపుడు .... అతను నీలాగే ముందర గూర్ఖాకి బేడ్డబ్బులు పారేసి స్టుడియోలో పాగా వేద్దామని ఆశపడ్డాడు. కానీ, కలిసిరాలే. ఆనక నా వంటి వాడెవడో వాడి మీద జాలిపడి ఎన్నిగేట్లు దాటాక స్టుడియోకి రావాలో చెప్పాడు. ఎక్‌స్ట్రా వేషాలయితే సరేసరి అనుకో. మరి కొత్తగా వచ్చినపుడు హీరో రోలుకి హీనపక్షం ఏడీ గిట్టదు కదా.

సరే లాలా గేట్ల దండయాత్ర ఆరంభించాడు.

రోజూ పొద్దున్నే ఒక ప్రొడ్యూసరుగారి గేటుదాటి వెళ్ళి దండం పెట్టి చివాట్లు ఫలహారంచేసి వచ్చేవాడు. అక్కడ నించి, ఒక గ్రేట్ డైరెక్టరు ఇంటికి వెళ్ళేవాడు. వాళ్ళది చిన్నగుమ్మం అనుకో. అయితేనేం గాక అని, అదే ఓ గేటు అనుకుని దాటి, మాటలు పడి తిరిగివచ్చేవాడు. ఆనక ఒక డాన్సు డైరెక్టరు యింటికి వెళ్ళి ఆయనతో కలసి ఇవతలికి వచ్చి చాయ్ ఇప్పించి సాగనంపి, మళ్ళీ డ్యూటీ మీద పోయేవాడు. ఒంటి గంటకి పెద్దపెద్ద హీరోలు, హీరోయినులు భోజనాలకు ఇళ్ళకు వస్తారు.

ఆవేళకి ఒకరియింటికెళ్ళి వరండాలో నిల్చుని మీడియంషాట్ దూరంలోంచి వారికి దండంపెట్టి చరితార్థుడయేవాడు. మధ్యాహ్నం, హీరో చిరునవ్వుకో, తల తాటింపుకో అర్థం, భావం అంటకట్టి కమ్మగా కలలుగని, అవే తిని పడుకుని లేచి మళ్ళీ రెండో షిఫ్టు మొదలెట్టేవాడు. ఈ షిఫ్టులో టెక్నీషియన్‌ల ఇంటి గేట్లను పవిత్రం చేసేవాడు. డైరెక్టరు దగ్గిర్నించి లైటు బోయిదాకా ఏదన్నా సరేనన్న స్థితికి వచ్చాడనుకో.

"కాస్త కాలు మోపనిస్తే చాలు అక్కణ్ణించి అలా అలాపైకి పాకేస్తాను" అనేవాడు ధైర్యంగా.

అందుకనే వాడంటే అందరికీ భయం అనుకో. వాడు అలాగే అనేవాడు. నేనూ అంతేలే. ఆ భయం కొద్దీ ఛాన్సులు రా కు ం డా చేసేస్తారు.

ఉఠి అసూయ అనుకో. వేషానికి మూడు వేలుచ్చుకునే వాళ్ళు కాస్తా వీడెక్కడ చేరిపోతాడో అని, ముప్పావలాకే ఒప్పేసుకునే వారంటే నమ్ము. నేను నమ్ముతానులే.

ఏం? ఇంక సాయంత్రం మళ్ళీ ప్రొడ్యూసర్ల దర్శనం చేసేవాడు.

ఇలా గేట్లుదాటగా దాటగా దాటగా కొన్నాళ్ళకి, ఒకాయనకి జాలి కలిగింది.

''బేటా? బాత్ క్యా హే' అన్నాడు.

"బాత్ యేహై కీ' అంటూ లాలా తన కథ చెప్పుకొచ్చాడు.

పది రూపాయలు తెచ్చుకో సిఫార్సు రాసిస్తా అన్నాడాయన జాలిగా.

లాలా పరుగెత్తుకుని నాదగ్గరకొచ్చి దుంపతెంపేసి, పదీ పుట్టించాడు. చెప్పద్దూ నాకూ ఆశపుట్టింది. వెధవ పది పోతే పోయిందిగాని, హీరో ఛాన్సు ఎందుకు వదులుకోవాలని నేనూ ఓపది పట్టుకు వెళ్ళా.

ఆ వెధవ మా ఇద్దరిచేతా అడ్డమైన డైలాగులూ అనిపించి రెండు పదులూ పుచ్చుకుని రేపు రమ్మన్నాడు.

అంతేనయ్యా.

'కల్లాజాప్ బేటా' అన్నాడు. వాడి కళ్లు తగలెయ్యా. వరి కల్ల ముండాకొడుకు. ఆరేప్పు రేపే. ఎన్నిరేపులు వాడి దిక్కుమాలిన గేటు దాటామొ తెలీదు. ఓరోజున వాడి ఖర్మంకాలి వొరికాడు.

'క్యా బేటా తు ఆగయా?' అన్నాడు సాదాగా నవ్వుతూ.

'నీ బేటా సిగతరగ. దొంగనాయాలా!,' అంటూ లేచి తన్నబోయాడు లాలా.

సరే నానాగోల అయ్యాక వాడు, 'మీ ఓపిక పరీక్షించాను' అంటూ మరిచిపోయి బతికిన శవంలా నవ్వి రెండుత్తరాలు రాసిచ్చాడు.

సరే ఇద్దరం ఒక్క దగ్గిరకే ఎందుకని, లాలా ఓ పెడకీ, నేనో పెడకీ పోయాం.

వాడి ఉత్తరాలు తగలెయ్యా. అవి చూడగానే గేటులో ఉన్న ప్రతివెధవా నవ్వడమే. అది విన్నాక అప్పుడు గేటులో లేని వెధవాయిలు కూడా పగలబడి నవ్వారు.

'గర్మాగరం టోక్రాఖాయా క్యాభయా' అన్నారు వాళ్ళు.

మాకు ఉత్తరాలిచ్చిన గడ్డపువెధవకి ఇదేవృత్తిట. ఇలా సిఫార్సులు యిస్తూ డబ్బు సంపాదిస్తున్నాడట. వాడి ఊహకూడా మంచిదేననుకో. ఇలా పోగేసిన డబ్బుతో ఓ సినిమా తీసి, అపుడేమో తన దగ్గిర టోకరా తిన్న నటులందరికీ హీరో రోల్సు ఇచ్చి ఉద్ధరిస్తాడుట. అయితేమటుకు?

నేను ఓ ఏడుపు ఏడిచి ఊరుకున్నాగాని, లాలా దీని అంతు కనుక్కుంటా నన్నాడు.

వాడు పాపం అలాగే గేట్లు దాటి దాటి చివరికి స్టుడియో గేటులో జూనియర్ గుమాస్తాగిరి సంపాదించాడు. అక్కడినించి మెల్లిగా స్టుడియోలోకి ఎలాగో జారుకుంటే ఆపైన అలా అలా పైకి పాకేస్తాడట. నేను ఇటు వచ్చేశాననుకో. వాడింకా అందంబఏే ఉన్నాడు.

ఏమిరా ఛాన్సు దొరికిందా అంటే 'అదిగో భద్రాద్రి! టూ మంత్స్‌లో దొరుకుతుంది' అంటాడు. అవి వుతి ఎండమావులని నా నమ్మకం. నువ్వూ అలాగే అనుకో. అయినా వాడి ఓర్పువల్ల అమాంతం ఎప్పుడో మహానటుడో ఇంకోడో అయిపోతాడు. అప్పుడు ఫిలింఫేరులో రాసుగోవచ్చు. వెండి తెరకి వచ్చేదాకా గేటులో బీటుకాసిన మహా ఫలానావాడు అలాని.

బాబూ నీకు అంత పట్టుదల, ఓపికా ఉన్నాయా? అన్నాడు రామనాథ నాథం కథ ముగించి.

'చాలా కష్టం అనుకుంటాను' అన్నాడు రాజు నానుస్తూ.

'అయితే లాభం లేదబ్బాయీ!' అన్నాడు రామనాథం.

* * * *

"అదిగో భద్రాద్రి!" అన్నాడు రాజు హఠాత్తుగా.

ఏదిగో?

"అదిగో!" అన్నాడు రాజు ఒక షెడ్డును చూపించి.

"అది స్టుడియో కాదు. మాజీ కాఫీ హోటలు. స్టుడియోలు చాలా పెద్దవి. ఇంకొంచెం ముందుకు చూడు. అల్లదిగో భద్రాద్రి! వెళ్ళిరా" అన్నాడు రామనాథం మలుపు తిరుగుతూ.